క్లుప్తంగా

వేడుకగా రంజాన్ పర్వదిన ప్రార్థనలు


రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న వెంకారెడ్డి

చీమకుర్తి: ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ముస్లింలు నిర్వహించిన రంజాన్ పవిత్ర పర్వదిన ప్రార్థన వేడుకలలో పాల్గొన్నారు. మంగళవారం చీమకుర్తి పట్టణంలోని నెహ్రూనగర్‌లోని మసీదులో స్థానిక ముస్లింలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ముస్లింలతో కలిసి మారం వెంకారెడ్డి ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీగిరిలో టీటీడీ పంచాంగాల విక్రయం

ఒంగోలు మెట్రో: తిరుమల, తిరుపతి దేవస్థానం ప్రచురించిన విశ్వావసు నామ నూతన సంవత్సర తెలుగు పంచాంగాలు ఒంగోలు కొండ మీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు వెల్లడించారు. టీటీడీ పంచాంగాలు కావాల్సిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థాన ధర్మకర్తలు కోరారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి ఉత్తర బైపాస్ వరకు ఉన్న పరిసర ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈఈ కేవీ.పాండు రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ డీ-3 పరిధిలోని వుడ్ కాంప్లెక్స్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాలలో కొంత సమయం పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

దళిత నేత నరసింహారావుకు నివాళులు

సంతనూతలపాడు: స్థానిక అంబేద్కర్ నగర్‌లో గుండెపోటుతో మృతి చెందిన మాజీ డీలర్ దళిత నేత యండ్రా పాటి నరసింహారావు మృతదేహాన్ని దళిత నాయకులు పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎస్సీ సెల్ నాయకులు సంకే సుబ్బారావు, కోతి కోటేశ్వరరావు, గొర్రె ముచ్చు చేజర్లయ్య, మార్పుడి రమేష్, తలారి నాగరాజు, బొంతా ప్రసాద్ తదితరులు మండల రేషన్ డీలర్ల సంఘం నాయకులు పి సుబ్బారావు, వెంగళరెడ్డి తదితరులు నరసింహారావుకు నివాళులర్పించారు.

సామాజిక దృక్పథం అవసరం


వలంటీర్లకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఏకేయూ వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: విద్యార్థి దశ నుంచే సమాజ సేవ అలవరచుకోవాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పేర్కొన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా మంగళవారం ఒంగోలులోని ముంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువత సమాజ సేవా కార్యక్రమంలో పాల్గొంటూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. అంతేకాకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, ఏ వృత్తిలోనైనా నిబద్ధతతో చేసినపుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి అభినందన సభను మంగళవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.రాజేంద్రబాబు, పి.రవితేజ, నిరోషా, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, కె.జోసఫ్, వై.పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

4న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో వచ్చే నెల 4వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య తెలిపారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తిసమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

సర్కారు కొనక.. దళారులకు అమ్మలేక !

- ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఇళ్ల ముందే కల్లాలు
- పంట ఎప్పుడు కొంటారోనని రైతుల ఎదురుచూపులు
- దళారులు కుమ్మక్కై తక్కువ ధరకే అడుగుతున్న వైనం


ఇంటి ముందు రాశులు పోసిన వరి ధాన్యం

నాగులుప్పలపాడు: పంటలు వేసేటప్పుడు చెప్పిన మాటలు కోతల సమయానికి లేకపోతే రైతులు పరిస్థితి ఎలా ఉంటుందో కూటమి ప్రభుత్వం రైతులకు తెలిసొచ్చేలా చేస్తోంది. రైతుల సంక్షేమం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం, ప్రతి పంటకు గిట్టుబాటు ధర అందించి రైతుల శ్రేయస్సుకు పాటు పడతాం అని చెప్తున్న మాటలు కేవలం ఎల్లో మీడియాలో రాతలకే సరిపోతున్నాయి. క్షేత్ర స్థాయిలో రైతన్నల బాధలు ఏ ఒక్కరికీ పట్టడం లేదు. కనపర్తి ఎత్తిపోతల పథకం కింద 5 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పంట వేసే సమయంలో అధిక వర్షాలతో పంటలు వరదలకు కొట్టుకుపోయినా అన్నం పెట్టే చేయి ఊరుకోదుగా అన్నట్లు రైతులు అధిక వ్యయాలకు ఓర్చి మరీ మళ్లీ నార్లు పోసి, వరి పంటలను సాగు చేశారు. పంట కాలంలో ఉండగానే రైతులకు ఏ మాత్రం నష్టం వాటిల్లకుండా వరి క్వింటాలకు ప్రభుత్వం రూ.2300 మద్దతు ధర ఇస్తుందని చెప్పారు. తీరా పంట చేతికొచ్చాక ఆ మాటలు మాయమయ్యాయి. కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని అమ్మనబ్రోలు, రాపర్ల, కనపర్తి, వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం, చింతాయగారిపాలెం గ్రామాల్లో రైతులు ఇప్పటికే వేల టన్నులు పంట పండించి ప్రభుత్వం కొనుగోలు చేయక ఇంటి ముంగిటే ఆరబెట్టుకొని అధికారులు వైపు చూస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు బస్తా రూ.1200 లకు ఇస్తారా మరో రూ.50 కలుపుకొని లోడు ఎత్తుతారా అని రైతులతో బేరాలకు దిగుతున్నారు. దళారుల తీరుతో విసుగెత్తిన రైతులు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కొనకపోతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

13 కిలోల వరకు తారం..

ప్రభుత్వ అధికారులైతే ధాన్యం కొనుగోలు చేయడానికి కసరత్తు చేసి సరుకు నాణ్యత బాగోలేదంటూ తారం ఎన్ని కిలోలు ఇస్తారంటూ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అధికంగా 13 కిలోల వరకు తారం అడగడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి ఇంతలా రైతులను ప్రభుత్వం దోచుకుంటే ఇంకా తామెలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం వెల్లడించిన రూ.2300 మద్దతు ధరకు కొనుగోలు చేస్తేనే కొంత మేరకైనా అయిన ఖర్చులను రాబట్టగలుగుతామని, దళారుల తీరుతో రైతులు తీవ్రంగా అప్పుల్లో కూరుకుపోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రైవేటు వాళ్లు తరలిస్తున్న ధాన్యం

రైతులను మోసగించడం తగదు



ఎన్నో బాధలకు ఓర్చయినా వరి పంట సాగు చేశాం. మొదట నార్లు పోసిన వెంటనే వరదలకు పోయినా ఖర్చుకు ఆగకుండా మళ్లీ నార్లు పోసి పంట పండిస్తే తీరా పంట చేతికొచ్చే సమయంలో ప్రభుత్వం ఇలా రైతులను మోసం చేయడం ఏ మాత్రం బాగోలేదు.

– గోలకారం వెంకట్రావు, రైతు,దాసరివారిపాలెం

రైతులపై సానుభూతితో పంట కొనుగోలు చేయాలి,,



ప్రభుత్వం ఇస్తానన్న మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయకపోవడంతో గ్రామాల్లో దళారుల హవా ఎక్కువైంది. మా ఇంటి ముంగిట ఉన్న పంటలను చూసి ప్రభుత్వం కొనే స్థితిలో లేదు తమకే ఇవ్వక చస్తారా అన్న చందంగా దళారుల మాటలు ఉంటున్నాయి. ఇప్పటి కైనా ప్రభుత్వం రైతుల పట్ల సానుభూతి లో పంటను కొనుగోలు చేయాలి.

– కన్నెదారి వెంకటేశ్వర్లు, రైతు, పెద్దపాలెం

29న విశ్వావసు నామ ఉగాది వేడుకలు

ఒంగోలుమెట్రో: శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ శనివారం విశ్వావసు నామ ఉగాది మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామని సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉగాది వేడుకలకు సంబంధించి కరపత్రాన్ని ఒంగోలు నగర కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ తెలుగువారికి అత్యంత ప్రధానమైన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో 9.30 గంటల నుంచి పంచాంగ శ్రవణంతో విశ్వావసునామ ఉగాది కవితా మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. చందు డాన్స్ అకాడమీచే సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. జరుగుతాయని అన్నారు. అనంతరం జరిగే ప్రధాన సభలో కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహిత్య జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కప్పగంతుల మధుసూదన్‌కు, సాంస్కృతిక సేవా రంగాలలో విశేషంగా కృషి చేస్తున్న యూవీ రత్నం, లంకా ప్రసన్న కుమార్ శర్మ, మెడబలిమి సాంబశివరావు, దన్నారపు మస్తాన్ రావు, సుంకర కళ్యాణి, స్వర్ణ హర్షిత తదితరులకు అందజేస్తామని ఆయన తెలిపారు. కనుక కవులు కళాకారులు, సాహితీవేత్తలు తెలుగు భాషాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గుర్నాథరావు, ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు నారపుశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ గిరిజా శంకర శాండిల్య, కళామిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, తదితరులు పాల్గొన్నారు

చెత్త సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం


శానిటేషన్‌పై కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

సంతనూతలపాడు: చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగించుకొని పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని మద్దిపాడు ఎంపీడీవో డీఎస్పీ వీ ప్రసాద్ పేర్కొన్నారు. నియోజకవర్గస్థాయిలో కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు చెత్తసంపద తయారీపై నాలుగు రోజులు పాటు జరిగిన శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో క్లాప్‌మిత్రలు తడి చెత్త, పొడి చెత్తను సేకరించి ఎస్ డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. తద్వారా గ్రామ పంచాయతీ ఆదాయాలను పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా రిసోర్స్ పర్సన్ పి.చక్రధర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సంతనూతలపాడు ఎంపీడీవో. డి సురేష్ బాబు, ఈవోఆర్డీ ఎం రమణమ్మ, కార్యదర్శి ఎస్ ప్రతాప్ కుమార్ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. మద్దిపాడు ఈవోఆర్డీ కే. రఘుబాబు, కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

చెరువులను సాగర్ నీటితో నింపాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్రావు

చీమకుర్తి: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలో ఉన్న అన్ని చెరువులను సాగర్‌నీటితో నింపాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రభుత్వాధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి రైతు సంఘం కమిటీ సమావేశంలో వెంకట్రావు పాల్గొన్నారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పశువులు దాహార్తిని తీర్చటంలో చెరువులు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల కారణంగా రైతులు పండించే అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. వాటికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించే పంట ఉత్పత్తులకు మద్దతు ధరలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో

చీమకుర్తి రూరల్: పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మద్దిపాడు సీడీపీవో ఇవాంజలి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బండ్లమూడి జిల్లా పరిషత్ పాఠశాలలో 2వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ-పడాయిబీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చీమకుర్తి, రామతీర్థం రెండు సెక్టార్ల 52 మంది అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. 0-5 ఏళ్ల పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, సమగ్ర అభివృద్ధి కోసం చేయాల్సిన అంశాలపై తల్లి బిడ్డల సంక్షేమం, సంరక్షణ, ఆరోగ్యం గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెండు సెక్టార్ల సూపర్‌వైజర్స్ ప్రమీల, దేవసేన పాల్గొన్నారు.

చిలకపాడు హైస్కూల్లో..

సంతనూతలపాడు: అంగన్వాడీ కార్యదర్శులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతుల ద్వారా వారి కేంద్రాలు మరింతగా అభివృద్ధికి పాటుపడాలని ఒంగోలు డిప్యూటీ డీఈవో ఏ. చంద్రమౌలీశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని చిలకపాడు హైస్కూల్లో రెండో రోజు అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో డీ వెంకారెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పి నాగలక్ష్మి, ఆర్ పిచ్చమ్మ, సంతనూతలపాడు, వేములపాడు సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని పేర్నమిట్టలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేలిని సృజన కార్యకర్తలకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఆదిలక్ష్మి, అనురాధ, వైద్యులు ఖాసిం పాల్గొన్నారు.

మహిళలు ఆత్మరక్షణ నేర్చుకోవాలి


మాట్లాడుతున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు సిటీ: మహిళలు ఆత్మరక్షణను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ప్రతిభ కాలేజీలో విద్యార్థినులకు శక్తియాప్, ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విజ్ఞానం పెరిగేకొలది నేరప్రవృత్తి కూడా పెరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు శక్తియాప్ డౌన్‌లోడ్ చేయించి పనిచేసే విధానం గురించి వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నేపథ్యంలో ఒంగోలు పేర్నమిట్ట క్యాంపస్‌లో శ్రీప్రతిభ కాలేజీ, గురుదత్త ప్రాంగణంలో శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుధాకర్, తాలుకా ఎస్సై అనిత గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య ద్వారా మహిళలు స్వయం సాధికారత సాధించి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం ముఖ్య అతిథులను చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు శ్రీనివాస రెడ్డి, జయశ్రీ,, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ


స్వామివారి పల్లకీ మోస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

ఒంగోలుమెట్రో: శ్రీవారి తిథి ఏకాదశి, జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఒంగోలు కొండమీద శ్రీగిరి గిరి ప్రదక్షిణ అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. మంగళవారం శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్థానిక శ్రీగిరి పాదపీఠం వద్దగల బాపూజీ గోసంరక్షణశాల వద్ద గోపూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ భక్తులు తమ భుజస్కంధాలపై స్వామి వారి పల్లకిని మోస్తూ భక్తి పారవశ్యంతో గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. కోర్టు సెంటర్, మాతా శిశు వైద్యశాల, గ్రంథాలయం, కేశవస్వామి పేట మీదుగా భగీరథ మహర్షి సెంటర్, శర్మ కాలేజ్ క్రికెట్ గ్రౌండ్, గద్దలగుంట, రాజాపానగల్ రోడ్డు దాటుకొని గోశాల ముందుగా శ్రీగిరి చేరి శ్రీవారిని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ సందర్భంగా గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధారమణ గుప్తా జంధ్యం మాట్లాడుతూ స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం, స్వామికి ఇష్టమైన తిథి ఏకాదశి రెండూ ఒకరోజు రావడంతో స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దాసరి నారయణ రావు, కోశాధికారి వలేటి కృష్ణారావు, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాస రావు, సభ్యులు ఎస్ కోటి సూర్యనారాయణ, ధనిశెట్టి రామునాయుడు, దేసు కృష్ణారావు, దోగిపర్తి మల్లికార్జునరావు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


చతుర్వేద పారాయణం లో అర్చకులు

వేడుకగా శ్రీవారి ఆస్థానం ..

ఆయలంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణం. విష్ణుసహస్ర నామ పారాయణంతో పాటు భారత భాగవత, భగవద్గీత రామాయణ శ్లోకాలను గానం చేశారు. గాయకురాలు దీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదుమధురంగా ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. శ్రీగిరి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు.

వృద్ధురాలి కంటి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: కంటి చూపు సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్న ఓ పేద వృద్ధురాలికి శివం ఫౌండేషన్ అండగా నిలిచిందని నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు అన్నారు. ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో ఉంటున్న వృద్ధురాలు పాశం హనుమాయమ్మ కంటి ఆపరేషన్‌కు ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సహాయం సుబ్బారావు ద్వారా అందజేశారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన పాశం అనసూయమ్మ కుటుంబ సభ్యులు పట్టించుకోని స్థితిలో గత రెండేళ్ల నుంచి శరణాలయంలో ఉంటోంది. ఈసందర్భంగా అతిథులు ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు సినీ నటుడు దన్నారపు మస్తాన్‌రావు, ఆసుపత్రి నిర్వాహకులు శ్రీనివాసరావు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

చీమకుర్తి: మున్సిపాలిటీలోని ఇళ్లు, ఖాళీ స్థలాలపై చెల్లించాల్సిన పన్నుకు వడ్డీలో 50 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నెంబర్ 46 ప్రకారం ఈనెల 31 లోపు చెల్లించే వారికి మాత్రమే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇళ్లు, ఖాళీ స్థలాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

సీఎం సమీక్షకు కలెక్టర్ హాజరు


జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలో నిర్వహించిన సమీక్షకు జిల్లాకు చెందిన మంత్రి, జిల్లా కలెక్టర్‌లు హాజరయ్యారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, మంత్రులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించిన విషయం విదితమే. అందుకుగాను జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాలు హాజరయ్యారు.

లైంగిక దాడులు జరగకుండా జాగ్రత్త వహించాలి

సింగరాయకొండ: పాఠశాలల్లో లైంగిక దాడులు జరగకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు హించాలని సీఐ సీహెచ్ హజరత్తయ్య అన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిపై లైంగికదాడుల విషయం తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థినుల సంరక్షణే మన కర్తవ్యమన్నారు. ఏఎస్సై శేషారెడ్డి, ఎంఈఓ-1 కత్తి శ్రీనివాసరావు, ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ఆకు పూజలు


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని మంగమూరు డొంక మర్రిచెట్టు కాలనీ దగ్గర వెలసియున్న పొలిమేర అభయాంజనేయ దేవస్థానంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. మంగళవారం ఆలయ అర్చకుడు పరాంకుశం సమీర్ ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ఆకు పూజను మన్యసూక్తంతో పూజా క్రతువులు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు స్థానిక భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందుకున్నారు.